www.aksharadarbar.com
శుక్రవారం 04, అక్టోబర్ 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంపుటి :02 | సంచిక :205 | పేజీలు : 05 | వెల : 05

## రేవంత్ రెడ్డి మొనగాడు కాదు..
# మోసగాడు



- బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారు
- హామీలు అమలు చేసే వరకు సీఎంను వదిలిపెట్టం
- ఢిల్లీలో రాహుల్ గాంధీ ఇంటి ముందు ధర్నా చేస్తాం..
- మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు
- తొర్రూరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా

04

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్
## 30 మందికిపైగా మావోయిస్టులు హతం

- ఇప్పటి వరకు 14 మృతదేహాలు లభ్యం..
- మృతుల్లో అగ్రనేతలు ఉండొచ్చని అనుమానాలు
- నక్సలైట్లు, పోలీసులకు మధ్య బీకర కాల్పులు
- నారాయణ్‌పుర్ - దంతెవాడ సరిహద్దు అబూజ్‌మడ్ అడవుల్లో ఘటన
- భారీఎత్తున ఆయుధాలు,
- పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్న భద్రతా దళాలు

05





- ఇసుక అక్రమ రవాణా కట్టడిలో విఫలమైన పదహారు మంది అధికారులపై చర్యలు
- ఈ నేపథ్యంలో తెరపైకి మల్టీ జోన్-1 పరిధిలోని జిల్లాల్లో ఇసుక అక్రమ రవాణా

- ఇసుక రవాణాలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల తీరుపై సర్వత్రా చర్చ
- వివిధ జిల్లాల్లో జీరో దందా, ఓవర్ లోడ్ వ్యవహారంలో పాత్రపై హాట్ టాపిక్
- పీడీఎస్ రైస్ అక్రమ రవాణాకు పోలీసుల హెల్ప్ పైనా తీవ్ర చర్చ

# వీళ్లపైనా వేటు పడేనా..!


మల్టీ జోన్-2 ఐజీపీ నిర్ణయంతో పోలీసు శాఖలో కలకలం

మల్టీజోన్- 2లోని తొమ్మిది జిల్లాల్లో ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడంలో విఫలమైన ముగ్గురు ఇన్ స్పెక్టర్లు, 13 మంది సబ్ ఇన్ స్పెక్టర్ల(ఎస్సై)లపై వేటుపడటం పోలీస్ శాఖలో కలకలం సృష్టించింది. ప్రధానంగా మల్టీజోన్-1 పరిధిలో గల జిల్లాల్లో ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడంలో విఫలం అవుతున్న పోలీస్ అధికారులపై కూడా వేటుపడేనా? అనేది ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది. మల్టీజోన్-2 ఐజీపీ వి సత్యనారాయణ ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్సైలపై వేటు వేసిన ఉత్తర్వులు విడుదల కాగానే మల్టీజోన్-1 పరిధిలోని జిల్లాల్లో ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడంలో విఫలం అవుతున్న పోలీస్ అధికారులపై చర్చకు తెర లేచింది. ఇక్కడ ఇసుక రవాణా జరుగుతున్న ప్రాంతాల్లో పని చేస్తున్న సీఐలు, ఎస్సైల్లో ఎవరెవరు ఇసుక అక్రమ రవాణా రవాణాను కట్టడి చేయడంలో విఫలం అవుతున్నారు,

02

ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్నారు అనేది సర్వత్రా చర్చనీయాంశమైంది. ముఖ్యంగా మల్టీ జోన్ -1 పరిధిలో ఇసుక క్వారీలు కలిగి, ఇసుక రవాణా జరుగుతున్న భూపాలపల్లి, ములుగు, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలతో పాటు ఆకేరు సహా వివిధ వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా సాగుతున్న వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జనగామ, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో ఇసుక అక్రమ రవాణాలో ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీస్ అధికారుల తీరుపై ఒక్కసారిగా చర్చ తెరపైకి వచ్చింది. వీళ్లపై కూడా త్వరలోనే పోలీస్ డిపార్ట్మెంట్ శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉండొచ్చని జనం ఎదురుచూడటం మొదలైంది.

- అక్షరదర్బార్, నిఘావిభాగం



# నరేష్‌రెడ్డి కన్నుమూత

అనారోగ్యంతో దవాఖానలో తుదిశ్వాస విడిచిన కాంగ్రెస్ రాష్ట్ర నేత

- రాజకీయ ప్రముఖుల దిగ్భ్రాంతి..
- శోకసంద్రంలో అభిమానులు
- డోర్నకల్ రాజకీయాల్లో నూకలది చెరగని ముద్ర
- మూడు దశాబ్దాలుగా క్రియాశీలక పాత్ర..
- పార్టీలకు అతీతంగా ప్రజాదరణ పొందిన లీడర్
- ఘొల్లుమన్న పురుషోత్తమాయగూడెం
- రేపు స్వగ్రామంలో అంత్యక్రియలు

04



# గ్యాంగ్ రేప్ నిందితుల అరెస్ట్

- మహేశ్వరం వద్ద ముగ్గురుని
- అదుపులోకి తీసుకున్న పోలీసులు
- సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం ..
- రిమాండ్‌కు తరలింపు
- వివరాలను వెల్లడించిన వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్

05

# వీళ్లపైనా వేటు పడేనా..!

- మల్టీ జోన్-2 ఐజీపీ నిర్ణయంతో పోలీసు శాఖలో కలకలం
- ఇసుక అక్రమ రవాణా కట్టడిలో విఫలమైన పదహారు మంది అధికారులపై చర్యలు
- ఈ నేపథ్యంలో తెరపైకి మల్టీ జోన్-1 పరిధిలోని జిల్లాల్లో ఇసుక అక్రమ రవాణా
- ఇసుక రవాణాలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల తీరుపై సర్వత్రా చర్చ
- వివిధ జిల్లాల్లో జీరో దందా, ఓవర్ లోడ్ వ్యవహారంలో పాత్రపై హాట్ టాపిక్
- పీడీఎస్ రైస్ అక్రమ రవాణాకు పోలీసుల హెల్ప్ పైనా తీవ్ర చర్చ

అక్షరదర్బార్, నిఘావిభాగం:




మల్టీజోన్– 2లోని తొమ్మిది జిల్లాల్లో ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడంలో విఫలమైన ముగ్గురు ఇన్ స్పెక్టర్లు, 13 మంది సబ్ ఇన్ స్పెక్టర్ల(ఎస్సై)లపై వేటుపడటం పోలీస్ శాఖలో కలకలం సృష్టించింది. ప్రధానంగా మల్టీజోన్–1 పరిధిలో గల జిల్లాల్లో ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడంలో విఫలం అవుతున్న పోలీస్ అధికారులపై కూడా వేటుపడేనా? అనేది ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది. మల్టీజోన్–2 ఐజీపీ వి సత్యనారాయణ ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్సైలపై వేటు వేసిన ఉత్తర్వులు విడుదల కాగానే మల్టీజోన్–1 పరిధిలోని జిల్లాల్లో ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడంలో విఫలం అవుతున్న పోలీస్ అధికారులపై చర్చకు తెర లేచింది. ఇక్కడ ఇసుక రవాణా జరుగుతున్న ప్రాంతాల్లో పని చేస్తున్న సీఐలు, ఎస్సైల్లో ఎవరెవరు ఇసుక అక్రమ రవాణా రవాణాను కట్టడి చేయడంలో విఫలం అవుతున్నారు, ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్నారు అనేది సర్వత్రా చర్చనీయాంశమైంది. ముఖ్యంగా మల్టీ జోన్ –1 పరిధిలో ఇసుక క్వారీలు కలిగి, ఇసుక రవాణా జరుగుతున్న భూపాలపల్లి, ములుగు, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలతో పాటు ఆకేరు సహా వివిధ వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా సాగుతున్న వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జనగామ, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో ఇసుక అక్రమ రవాణాలో ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీస్ అధికారుల తీరుపై ఒక్కసారిగా చర్చ తెరపైకి వచ్చింది. వీళ్లపై కూడా త్వరలోనే పోలీస్ డిపార్ట్మెంట్ శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉండొచ్చని జనం ఎదిరిచూడటం మొదలైంది.

## మల్టీ జోన్-1లోనూ ఇసుక రవాణా జోరు

మల్టీ జోన్–2 పరిధిలోని 9 జిల్లాల్లో ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడంలో విఫలమైన ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్సైలను వీఆర్ లో పెడుతూ మల్టీజోన్–2 ఐజీపీ సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు విడుదల చేసిన విషయం తెలిసిందే. వీరిలో కొందరికి ఇసుక అక్రమ రవాణాలో ప్రత్యక్ష, పరోక్ష సహకారం ఉన్నందున వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన వెల్లడించారు. త్వరలో ఈ అధికారులను బదిలీ చేయనున్నట్లు కూడా స్పష్టం చేశారు. రాష్ట్ర నిఘా అధికారుల నివేదికలు, ఇతర ఎంక్వైరీల ద్వారా ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వాగులు, నిషేధిత నది ప్రాంతాల్లో ఎక్కడబడితే అక్కడ విచక్షణ రహితంగా ఇసుకను తవ్వితే పర్యావరణ సమతుల్యానికి భంగం వాటిల్లే అవకాశం ఉన్నందున ప్రభుత్వం, డీజీపీ ఇసుక అక్రమ రవాణా విషయంలో సీరియస్ గా ఉన్నందున ఈ చర్యలు తీసుకున్నట్లు ఐజీపీ ప్రకటించారు. ఇసుక అక్రమ రవాణాలో వసూళ్లు చేయడం వల్ల ఒక హోంగార్డు, పోలీస్ హెడ్ కానిస్టేబుల్ ను డీఏఆర్ కు అటాచ్ చేశారు. తదుపరి చర్యలు పీడీఎస్ అక్రమ రవాణాపై ఉంటాయని ఐజీపీ సత్యనారాయణ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, డీజీపీ సీరియస్ గా ఉన్నందున ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న మల్టీ జోన్–1 పరిధిలోని జిల్లాల్లో సాగుతున్న ఇసుక అక్రమ రవాణాపై కూడా ప్రభుత్వం దృష్టి సారించే అవకాశం ఉందనే చర్చ తెరపైకి వచ్చింది. ముఖ్యంగా మల్టీ జోన్–1 పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్ తదితర జిల్లాల్లోని వాగులు, నదుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అనేకమంది ఇసుకను లారీలు, ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఈ జీరో దందాకు స్థానికంగా పనిచేస్తున్న కొందరు సీఐలు, ఎస్సైలు తమ వంతు సహకారం అందిస్తున్నారని, ప్రతిఫలంగా అవగాహన మేరకు ముడుపులు పొందుతున్నారనే ఆరోపణలు కోకొల్లలు. జనగామ, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, పెద్దపల్లి, కొత్తగూడెం, ఖమ్మం తదితర జిల్లాల్లో ఓపెన్ గా ఈ జీరో దందా కొనసాగుతుంది.

## ఆదాయ వనరుగా...

మల్టీ జోన్–వన్ పరిధిలోని జిల్లాల్లో ఇసుక అక్రమ రవాణా పలువురు పోలీస్ అధికారులకు ఆదాయ వనరుగా మారింది. ఇసుక అక్రమ రవాణా జరిగే కొన్ని ప్రాంతాల్లో ఈ బిజినెస్ ను దృష్టిలో పెట్టుకొని సీఐలు, ఎస్ఐలు పలువురు పోస్టింగ్ ల కోసం తీవ్రస్థాయిలో పోటీ పడుతున్న పరిస్థితి. ఎంత ఖర్చయినా పర్వాలేదని ఆమ్దాన్ వచ్చే ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్లలో పోస్టింగ్ దక్కించుకుంటున్నారు. ఓపెన్ గా ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్న అధికారుల తీరు అనేక సందర్భాల్లో బహిర్గతమైంది. నదులు, వాగుల నుంచి లారీలు, ట్రాక్టర్ల ద్వారా అనుమతులు లేకుండా ఇసుక తరలింపునకు పూర్తిగా హెల్ప్ చేస్తున్నారు. ఇటీవల భూపాలపల్లి జిల్లాలోని నుంచి మానేరు నది ఇసుక లోడుతో వే బిల్లులు లేకుండా పెద్దపల్లి జిల్లా మీదుగా హైదరాబాద్ కు వెళ్తున్న పలు లారీలను మార్గమధ్యంలో సుల్తానాబాద్ పోలీసులు అనూహ్యంగా పట్టుకుని కేసులు చేశారు. భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, పెద్దపల్లి సహా పలు జిల్లాల నుంచి ఇలా వేబిల్లులు లేకుండా జీరోపై వెళ్తున్న ఇసుక లారీలు అనేక చోట్ల పట్టుబడడం జరిగింది. జీరో దందాకు తోడు ఓవర్ లోడ్ తో వెళ్లే ఇసుక లారీలను కూడా తనిఖీల్లో పట్టుకుని తమ టార్గెట్ పూర్తికాగానే ఎలాంటి కేసులు లేకుండా వాటికి రైట్ చెప్తున్నారు. కొద్దిరోజుల క్రితం భూపాలపల్లి జిల్లాలో కాటారం వద్ద ఓవర్ లోడ్ తో పట్టుబడిన ఇసుక లారీలను పోలీసులు కేసులేమీ లేకుండా వదిలేసిన విషయం తెలిసిందే. ఇలా మల్టీజోన్–1 పరిధిలోని జిల్లాల్లో విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. మల్టీజోన్–2 ఐజీపీ నిర్ణయంతో మల్టీ జోన్–1 పరిధిలోని జిల్లాల్లో ఇసుక అక్రమ రవాణాకు హెల్ప్ చేస్తున్న పోలీస్ అధికారుల్లో భయం మొదలైందని తెలుస్తోంది. అంతేకాదు ఇసుక అక్రమ రవాణాలో సహకరిస్తున్న పోలీస్ అధికారుల్లో ఎవరెవరు ఉన్నారు?, ఎవరి పాత్ర ఎంత అనేది? ప్రస్తుతం ఆసక్తికర చర్చనీయాంశమైంది. ఇదిలా ఉంటే పీడీఎస్ రైస్ అక్రమ రవాణాకు సహకరిస్తున్న ఇక్కడి పోలీసు అధికారుల పనితీరుపైనా చర్చ జరుగుతుంది.



# భూపాలపల్లి అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అక్షర దర్బార్,భూపాలపల్లి : భూపాలపల్లి పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 14, 17, 29, 23, 25 వార్డుల్లోని జంగేడు, సుభాష్ కాలనీ, రాజీవ్ నగర్, కారల్ మార్క్స కాలనీలల్లో రూ.139 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు ఆయన కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భూపాలపల్లి పట్టణంతో పాటు, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# మాట నిలుపుకున్న సీపీ..

- 35మంది ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ అందజేత
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు


ఆటో డ్రైవర్లకు లైసెన్సులు అందజేస్తున్న సీపీ ఝా

అక్షరదర్బార్, హన్మకొండ: ఆటోడ్రైవర్లకు ఇచ్చిన మాటను సీపీ అంబర్ కిశోర్ ఝా నిలుపుకున్నారు. ట్రైసిటీ పరిధిలోని ఆటోడ్రైవర్లతో కొద్ది రోజుల క్రితం ట్రాఫిక్ పోలీసులు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. లైసెన్స్ లేని ఆటో డ్రైవర్లకు లైసెన్స్ ఇప్పించాలని ఆటోడ్రైవర్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా దృష్టికి తీసుకరాగా డ్రైవింగ్ లైసెన్సు లేకుండా సూదీర్ఘ కాలంగా ఆటో నడుపుతున్న డ్రైవర్లకు లైసెన్సులు అందిస్తామని సీపీ హామీ ఇచ్చారు. ఈమేరకు కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రైవింగ్ లైసెన్స్ లేని 35మంది ఆటోడ్రైవర్లకు శుక్రవారం లర్నింగ్ లైసెన్స్‌లను అందజేశారు. అనంతరం సీపీ మాట్లాతుడూ... కేవలం ఛలాన్లతో వాహనదారులను ఇబ్బందిపెట్టడం ట్రాఫిక్ పోలీసులు అభిమతం కాదన్నారు. వాహనదారులతోపాటు, ఆటోల్లో ప్రయాణించేవారు, ఆటో డ్రైవర్లు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవడం ట్రాఫిక్ పోలీసుల ప్రధాన లక్ష్యమని అన్నారు. రానున్న రోజుల్లో వరంగల్, హనుమకొండ పరిధిలోని లైసెన్స్ లేని ఆటోడ్రైవర్లకు సైతం లైసెన్స్‌లు అందజేస్తామని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి

**- మంత్రి సీతక్క**

అక్షర దర్బార్,భూపాలపల్లి: మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి నూరు శాతం రాయితీపై ఉచిత చేప పిల్లల పంపిణీ చేపట్టినట్లు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. శుక్రవారం గణపురం మండలంలోని గణప సముద్రం రిజర్వాయర్ లో మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత చేప పిల్లల వేసే కార్యక్రమంలో భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్య నారాయణ రావు, కలెక్టర్ రాహుల్ శర్మ, తెలంగాణ ఫిషరీష్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికు మార్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి నూరు శాతం రాయితీపై ఉచిత చేప పిల్లలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గణప సముద్రం చెరువులో 51,800 ఉచిత చేప పిల్లలు వేశామని పేర్కొన్నారు. శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం అవడంతో పాటు, రాష్ట్ర ఆర్థికవ్యవస్థ కూడా ప్రగతిపథంలో ముందుకు సాగుతుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో గొర్రెలు, చేపలు పథకాలలో అవినీతికి పాల్పడినట్లు తెలిపారు. మత్స్యకారులు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ హనుమంతరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్, మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.



గణప సముద్రం చెరువులో చేప పిల్లలను వేస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే జీఎస్సార్

### పరకాలలో పరామర్శ..

అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణంలో ఒంటెరు దేవరాజు తండ్రి ఒంటెరు సారయ్య ఇటీవల మృతిచెందగా ఆయన చిత్రపటానికి శుక్రవారం మంత్రి సీతక్క పూలమాలవేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సీతక్క తో పాటు పరకాల పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, పరకాల పట్టణ కౌన్సిలర్లు ఒంటేరు సారయ్య, మడికొండ సంపత్, పంచగిరి జయమ్మ, ఏఎంసి డైరెక్టర్ దాసరి బిక్షపతి, మాజీ ఎంపీపీ ఒంటె రామ్మూర్తి, కాంగ్రెస్ నాయకులు పర్నం మల్లారెడ్డి, వివిధ వార్డు అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

## ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ పోటీలు ప్రారంభం

అక్షర దర్బార్, భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఎమ్మెస్సార్ యువసేన ఆధ్వర్యంలో ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ పోటీలను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎస్పీ కిరణ్ ఖరే హాజరై మాట్లాడుతూ జిల్లాలో క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహించడం కోసం టోర్నమెంట్ ను ఏర్పాటు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మాదరి అఖిల్, నాగవెల్లి విక్రమ్, బుర్ర అశోక్, రవి కాంత్, మలోతు నరసింహ, సామల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## బురద జల్లే రాజకీయాలు మానుకోవాలి

**కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్**



అక్షర దర్బార్, పరకాల : నడికూడ కాంగ్రెస్ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించడాన్ని ఓర్వ లేని ప్రతిపక్ష నాయకులు బురదజల్లే ప్రయత్నాలు చేస్తూ పత్రికల్లో తప్పుడు కథనాలు రాయిస్తూ పబ్బం గడుపుతున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు తప్పు చేసినట్లు రుజువు చేస్తే దేనికైనా సిద్ధమేనని స్పష్టం చేశారు.

## డిజిటల్ కార్డ్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

**నర్సంపేట ఆర్డీవో కృష్ణవేణి**

అక్షర దర్బార్, దుగ్గొండి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ సర్వే కుటుంబ సర్వేను పకడ్బందిక నిర్వహించాలని నర్సంపేట ఆర్డిఓ కృష్ణవేణి సూచించారు శుక్రవారం మండలంలో నిర్వహిస్తున్న రిజిస్టర్ సర్వే కుటుంబ సర్వేన ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి వివరాలను పరిశీలించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబ వారీగా కుటుంబ సభ్యుల వివరాలను వారి ఆధార్ కార్డుతో సహా పూర్తి వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తప్పులు లేకుండా రికార్డ్ చేయాలన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లెక్కల అరుంధతి ఎంపీ శ్రీధర్ గౌడ్ తో పాటు పంచాయతీ కార్యదర్శి పలువురు అధికారులు పాల్గొన్నారు



మందపల్లిలో సర్వే పరిశీలిస్తున్న ఆర్డీవో

## నియామకాలు తక్షణమే చేపట్టాలి

**ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజ్**



అక్షర దర్బార్, భూపాలపల్లి: రాష్ట్రంలో డీఎస్సీ ఫలితాలు విడుదల చేసి అక్టోబర్10 నాటికి నియామకాలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడాన్ని హర్షిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. ఇదే సందర్భంలో డీఎస్సీ రాసిన అభ్యర్థులే జూనియర్ లెక్చరర్ పరీక్షలు కూడా రాశారని, రెండు పరీక్షల్లో మంచి ర్యాంకు వచ్చిన అభ్యర్థులు ఏదో ఒకటి ఎంపిక చేసుకునేలా రెండు పోస్టుల నియామకాలను ఒకేసారి చేపట్టాలని కోరారు.



నియామకపత్రం అందుకుంటున్న పవన్ కుమార్

## మాదిగ జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షుడిగా మడికొండ పవన్ కుమార్

అక్షర దర్బార్, పరకాల : పరకాల మండల కేంద్రంలోని అమర ధామంలో మాదిగ జర్నలిస్ట్ ఫోరం జిల్లా ముఖ్య నాయకుల కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శి కోడెపాక భాస్కర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. సమావేశానికి మాదిగ జర్నలిస్టు ఫోరం స్టేట్ కమిటీ మెంబర్ పెండ్యాల సుమన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాదిగ జర్నలిస్ట్ ఫోరం పరకాల మండల అధ్యక్షుడిగా మడికొండ పవన్ కుమార్ ని నియమించారు. మాదిగ జర్నలిస్ట్ ఫోరం ఏ పార్టీకి అనుబంధం కాదని స్వతంత్ర్య ప్రతిపత్తి కలిగిన సంఘమని, సంఘం ఆధ్వర్యంలో మాదిగ ఉపకులాల జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం పాటు పడుతుందని అన్నారు.

## బీఆర్ఎస్ పై విమర్శలు మానుకోవాలి

**బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సనత్ కుమార్**



అక్షర దర్బార్, పరకాల : మహిళా మంత్రిగా కొండా సురేఖ మహిళలపై, బీఆర్ఎస్ నాయకులపై చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు శాతరాశి సనత్ కుమార్ అన్నారు. ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్, కేసీఆర్, కేటీఆర్ పై విమర్శలు మాని, ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టాలని హితవుపలికారు. మహిళల పట్ల ఇలా మాట్లాడితే మహిళల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

## ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

**టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి**

అక్షర దర్బార్, నెక్కొండ : మండల కేంద్రంలో లోని రామాలయం అభివృద్ధికి నూతన పాలక వర్గం కృషి చేయాలని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి సూచించారు. శుక్రవారం నెక్కొండ రామాలయ నూతన చైర్మన్, పాలక వర్గం సభ్యులు ఆలయ అర్చకులు ఎక్స్ ఆఫీషియో సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితుడు బి వి వి శాస్త్రి మండల,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్,పెండ్యాల హరిప్రసాద్ ,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సింగం ప్రశాంత్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొల్లి సుబ్బారెడ్డి,కుసుమ చెన్నకేశవులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, దొడ్డ విజయ్,మెట్టు నర్సింహా రెడ్డి ఈదునూరి సాయికృష్ణ, నరసింహ స్వామి,సుబ్బరెడ్డి,భానుప్రకాష్,, ఈదునూరి దిలీప్, మహ్మద్ అఫ్జల్, అమీద్ పాల్గొన్నారు.



పాలకవర్గాన్ని అభినందిస్తున్న రంజిత్ రెడ్డి

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక



తొర్రూరు మహాధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్ రావు

# రేవంత్ రెడ్డి మోసగాడు

- బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారు
- హామీలు అమలు చేసే వరకు సీఎంను వదిలిపెట్టం
- ఢిల్లీలో రాహుల్ గాంధీ ఇంటి ముందు ధర్నా చేస్తాం..
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు
- తొర్రూరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా

అక్షరదర్బార్, తొర్రూరు : పది నెలల ప్రజాపాలనలో సీఎం రేవంత్ రెడ్డికి రైతులు, ప్రజలు అంటే పట్టింపు లేదు.. ఆయన మొనగాడు కాదు మోసగాడు అని తేలిపోయిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. హామీలు అమలు చేసే వరకు సీఎం రేవంత్ రెడ్డిని వదిలిపెట్టమని హెచ్చరించారు. ఒక్క బస్సు తప్ప రేవంత్ పాలన అంతా తుస్సేనని ఎద్దేవ చేశారు. రైతులు చనిపోయినా రేవంత్‌కు కనికరం లేదా అని ప్రశ్నించారు. ప్రజల నుంచి నిరసన వచ్చినప్పుడు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యేలు, మంత్రులను రైతులు నిలదీయాలని కోరారు. మానుకోట జిల్లా తొర్రూరులో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మహాధర్నా నిర్వహించగా హరీష్‌రావు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులుచెరిగారు. సీఎం రేవంత్‌రెడ్డి ఒకచేతిలో రాజ్యాంగం మరో చేతితో రౌడీయిజం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌ది రైతు గుండె రేవంత్‌ది రాతిగుండె అని హరీష్‌రావు విమర్శించారు.

## రాహుల్ ఇంటి ముందు ధర్నా చేస్తం..

వరంగల్ డిక్లరేషన్ అమలు కోసం ఢిల్లీలోని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇంటి ముందు ధర్నా చేస్తామని హరీష్‌రావు అన్నారు. దసరా తర్వాత ఢిల్లీకి వెళ్తామని చెప్పారు. రైతుల రుణమాఫీ చేసే వరకూ వదిలిపెట్టమని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై రాహుల్ గాంధీ స్పందించాలని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అబద్దాల పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఆగష్టు 15వ తేదీలోగా రుణమాఫీ చేస్తామని అన్ని దేవుళ్లపై ఒట్టుపెట్టి మోసగాడిగా మారారని హరీష్‌రావు విమర్శించారు. రేవంత్ రెడ్డి మొనగాడు కాదు మోసగాడు అని విమర్శించారు. 31 కుంటి సాకులు చెప్పి రేవంత్ రుణమాఫీ ఎగ్గొడుతున్నారని అన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూలిస్తే ఊరుకోమని హరీష్‌రావు హెచ్చరించారు. రేవంత్ రెడ్డి దసరాలోపు రైతుబంధు డబ్బులు ఇవ్వాలని హరీష్‌రావు కోరారు.



# పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్యాయత్నం..

- కార్యాలయంలోనే పురుగుల మందు తాగిన నాగలక్ష్మి
- హుటాహుటిన మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలింపు
- ఇండిపెండెంట్ జర్నలిస్టు వేధిస్తున్నాడని సూసైడ్ నోట్
- అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన
- కురవి మండలం తట్టుపల్లిలో ఘటన
- బాధితురాలికి యూనియన్ నేతల పరామర్శ..

అక్షరదర్బార్, మహబూబాబాద్ : కురవి మండలం తట్టుపల్లి గ్రామ పంచాయతీ సెక్రటరీ వీ నాగలక్ష్మి ఆత్మహత్యకు యత్నించారు. పంచాయతీ కార్యాలయంలోనే తనవెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగారు. గమనించిన స్థానికులు హుటాహుటిన మానుకోటలోని ఏరియా దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. కాగా, తట్టుపల్లి గ్రామానికి చెందిన ఇండిపెండెంట్ జర్నలిస్టు వేధింపులు తాళలేకే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సూసైడ్ నోట్‌లో నాగలక్ష్మి వెల్లడించారు. దవాఖానలో చికిత్స పొందుతున్న కార్యదర్శిని యూనియన్ నేతలు పరామర్శించారు. నాగలక్ష్మిని వేధింపులకు గురిచేసిన దొంతు యాదగిరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఏడాదిగా యాదగిరి వేధింపులు

మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం గ్రామానికి చెందిన నాగలక్ష్మి రెండేళ్లుగా కురవి మండలం తట్టుపల్లి గ్రామంలో ఓపీఎస్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సంవత్సరం నుంచి అదే గ్రామానికి చెందిన ఇండిపెండెంట్ జర్నలిస్టు వేధింపులకు గురిచేస్తున్నాడు. ఆయన వేధింపులు తాళలేక నాగలక్ష్మి డీపీవో, డీఎల్‌పీవో, ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ ఎన్నికల ఓటర్ లిస్టుపై కొంతకాలంగా వివాదం రగులుతోంది. ఈ మేరకు కురవి మండల ఎంపీవో, ఎంపీడీవో నాగలక్ష్మికి ఇటీవల షోకాజ్ నోటీస్ జారీ చేశారు. దీంతో తీవ్ర మానసిక వేదనకు గురైన నాగలక్ష్మి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించారు.

# నరేష్ రెడ్డి కన్నుమూత

- అనారోగ్యంతో దవాఖానలో తుదిశ్వాస విడిచిన కాంగ్రెస్ రాష్ట్ర నేత
- రాజకీయ ప్రముఖుల దిగ్భ్రాంతి..
- శోకసంద్రంలో అభిమానులు
- డోర్నకల్ రాజకీయాల్లో నూకలది చెరగని ముద్ర
- మూడు దశాబ్దాలుగా క్రియాశీలక పాత్ర..
- పార్టీలకు అతీతంగా ప్రజాదరణ పొందిన లీడర్
- అధికారంలేకున్నా మెండుగా అభిమానఘనం
- రెండుసార్లు రెడ్యానాయక్ చేతిలో ఓటమి
- ఘొల్లుమన్న పురుషోత్తమాయగూడెం
- రేపు స్వగ్రామంలో అంత్యక్రియలు



అక్షరదర్బార్, మహబూబాబాద్ : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, డోర్నకల్ నియోజకవర్గ సీనియర్ నేత నూకల నరేష్‌రెడ్డి కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం గ్రామానికి చెందిన నరేష్ రెడ్డి మూడు దశాబ్దాలుగా డోర్నకల్ నియోజకవర్గ రాజకీయాల్లో క్రియాశీలకంగా పనిచేశారు. స్నేహ యూత్ స్థాపించి యువతలో క్రేజ్ సంపాదించుకున్నారు. 1994లో తొలిసారి డోర్నకల్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. 1999లో తెలుగుదేశం పార్టీలో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేసి పరాజయం పాలయ్యారు. రెండుసార్లు కాంగ్రెస్ అభ్యర్థి రెడ్యానాయక్ చేతిలో ఓటమి చవిచూశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు టీఆర్ఎస్‌లో చేరిన ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఖమ్మం జిల్లా టీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో రేవంత్ రెడ్డి ఆహ్వానం మేరకు హస్తం పార్టీలోకి వెళ్లారు. అయితే ... ఏ పార్టీలో ఉన్నా తనకంటూ సొంత క్యాడర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అంతేగాక పార్టీలకు అతీతంగా అభిమానులను సంపాదించుకున్నారు. డోర్నకల్ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన నరేష్‌రెడ్డి మరణంపై పలువురు రాజకీయ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులు, ఆయన అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. పురుషోత్తమాయగూడెంలో విషాదచ్ఛాయలు అలుముకున్నాయి. రేపు స్వగ్రామంలో నరేష్‌రెడ్డి అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

# సద్దుల వేడుకకు ముస్తాబవుతున్న ఊరచెరువు

అక్షర దర్బార్,కాటారం : సద్దుల బతుకమ్మ వేడుకలకు కాటారం ఊర చెరువు ముస్తాబవుతోంది. కాటారం మండలకేంద్రంలోని అయ్యప్ప టెంపుల్ పరిసర ప్రాంతంలో ఉన్న ఊర చెరువును ఎంపీడీవో అడ్డూరి బాబు ఆధ్వర్యంలో అధికారులు సిద్ధం చేస్తున్నారు. శుక్రవారం చెరువు పరిసరాల్లో పరిశుభ్రత పనులను చేయిస్తూ ట్రాక్టర్ బ్లేడ్ తో ముళ్ల చెట్లను తొలగింపచేశారు.అలాగే పూల నిమజ్జనం జరిగే ప్రాంతంలో లైట్లను బిగించారు.గతంలో కంటే భిన్నంగా ఊర చెరువును ఎంపీవో వీరస్వామి దగ్గరుండి ముస్తాబు చేయిస్తుండడం పట్ల కాటారం గ్రామస్తులు అభినందనలు తెలుపుతున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి షగీర్ ఖాన్ పాల్గొన్నారు.



చెరువు వద్ద పనులని పరిశీలిస్తున్న ఎంపీడీవో బాబు

# వీరస్వామికి డాక్టరేట్

అక్షరదర్బార్, కేయూ క్యాంపస్: కేయూలో పరిశోధక విద్యార్థి మాతంగి వీరస్వామికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. అభ్యుదయ కవి, విమర్శకుడు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌వీ సత్యనారాయణ రచనలు – పరిశీలన అనే అంశంపై ప్రొఫెసర్ బన్న ఐలయ్య పర్యవేక్షణలో పరిశోధన చేశారు. మహబూబాబాద్ జిల్లా కంబాలపల్లి గ్రామానికి చెందిన మాతంగి వీరస్వామి 1987 సంవత్సరంలో జైళ్ల శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరి అంచెలంచెలుగా ఎదిగారు. ప్రస్తుతం అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా హైదరాబాద్ రేంజ్ డీఐజీ కార్యాలయంలో పని చేస్తున్నారు. ఉద్యోగంలో చేరిన తరువాతే కాకతీయ విశ్వవిద్యాలయంలో డిగ్రీ, పీజీ పూర్తి చేశారు.



అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక | వరంగల్ | శుక్రవారం 04.10.2024 | 05

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- నక్సలైట్లు, పోలీసులకు మధ్య ఎదురు కాల్పులు
- 36 మంది మావోయిస్టులు మృతి..
- కొనసాగుతున్న సెర్చ్ ఆపరేషన్
- అగ్రనేతలు ఉండొచ్చని అనుమానాలు
- భారీఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం



అక్షరదర్బార్, వరంగల్: ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మరోమారు తుపాకుల మోత మోగింది. నారాయణ్‌పూర్ – దంతెవాడ సరిహద్దు అటవీ ప్రాంతంలో శుక్రవారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, పోలీసులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోలు మృతి చెందినట్లు ఛత్తీస్‌గఢ్ పోలీసులు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ, నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతం అబూజ్‌మడ్‌లో మావోయిస్టులు ఉన్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఈమేరకు ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగా కూంబింగ్ నిర్వహిస్తున్న భద్రతా దళాలకు మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో మధ్యాహ్న సమయంలో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎదురుకాల్పుల్లో 36మంది మావోయిస్టులు మరణించినట్లు పోలీసులు పేర్కొన్నారు. కాగా మృతుల్లో అగ్రనేతలు ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎదురు కాల్పుల్లో మృతిచెందిన మావోయిస్టుల మృతదేహాలను ఘటనా స్థలంలో గుర్తించినట్లు భద్రతా దళాలు తెలిపాయి. అలాగే మృతుల నుంచి భారీఎత్తున ఆటోమేటెడ్ ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎన్‌కౌంటర్ కొనసాగుతున్నందున మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు భద్రతా దళాలు తెలిపాయి.

# గ్యాంగ్ రేప్ నిందితుల అరెస్ట్

- మహేశ్వరం వద్ద ముగ్గురుని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- సెల్ ఫోన్లు, కారు స్వాధీనం ..
- రిమాండ్ కు తరలింపు
- వివరాలను వెల్లడించిన వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్


వివరాలు వెల్లడిస్తున్న వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్‌లో కలకలంరేపిన గ్యాంగ్ రేప్ నిందితులు ముగ్గరిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం మీడియా ఎదుట నిందితులను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కేసు వివరాలను వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ ఇంతేజార్‌గంజ్ సీఐ మచ్చ శివకుమార్‌తో కలిసి వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. భూపాలపల్లి హనుమాన్ నగర్‌కి చెందిన తాటి శివరాజ్ కుమార్ లక్నేపల్లిలో బీటెక్ చదువుతున్నాడు. అతనికి గోదావరిఖనికి చెందిన కూచన మణి దీప్, కొడం వివేక్ స్నేహితులు. భూపాలపల్లిలో తన మిత్రుడు పుట్టపాక శరత్ ద్వారా బాధితురాలు మూడు సంవత్సరాల క్రితం పరిచయమైంది. అప్పటి నుంచి ఆమెతో ఫోన్‌లో మాట్లాడేవాడు. లవ్ ప్రపోజ్ చేస్తే తను రిజెక్ట్ చేసి, ఫ్రెండ్స్ గా ఉందామని చెప్పింది. అందుకు అంగీకరించిన శివరాజ్ అప్పటి నుండి తరుచూ ఆమెతో ఫోన్లో మాట్లాడేవాడు. ఈక్రమంలోనే ఈనెల 15న మణిదీప్.. శివరాజ్, వివేక్ ను కలవడానికి బిట్స్ కాలేజీకి వచ్చాడు. ఈక్రమంలోనే శివరాజ్ కుమార్ తన గర్ల్‌ఫ్రెండ్ గురించి స్నేహితులకు చెప్పి ఆమెను ఎలాగైనా అనుభవించాలని తన మనస్సులో వున్న కోరికను మణిదీప్, వివేక్‌కు చెప్పగా వాళ్ళు ఇద్దరు నీకు మేము సపోర్ట్ చేస్తాం కానీ మాకు అవకాశం ఇవ్వాలి అని అడగ్గా అందుకు శివరాజ్ ఒప్పుకున్నాడు. ముగ్గురు కలిసి పథకం ప్రకారం వెంటనే వరంగల్ శివారులోని కళాశాలలో ఉన్న విద్యార్థినికి కాల్ చేసి లంచ్ చేద్దాం బయటకు రమన్నగా నమ్మి ఆమె ఓకె చెప్పింది. వెంటనే ముగ్గురు కలిసి మణిదీప్ కారులో కాలేజీ దగ్గరకు వెళ్లి ఆమెను ఎక్కించుకున్నారు. వేరే ఇద్దరు కారులో వుండగా ఆమె భయపడి రాను అంటుండగా శివరాజ్ చేయిపట్టుకుని బలవంతంగా తన పక్కన కూర్చోబెట్టుకొని బెదిరించి పోచంమైదాన్ సెంటర్ దగ్గర వైన్ షాప్‌లో మద్యం కొని, బస్‌స్టాండ్ సమీపంలో గల ఓయో లాడ్జికి తీసుకెళ్లారు. అనుకున్న ప్రకారం ముగ్గురు కలిసి బలవంతంగా ఆమెపై లైంగికదాడికి పాల్పడి వెళ్లిపోయారు. బాధితురాలు కూడా రూంలో నుండి వచ్చి బయటకు వెళ్లిపోయింది. జరిగిన విషయం ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించగా.. . కాలేజీలో తెలిస్తే ఎగ్జామ్స్ రాయనివ్వరని భయపడి ఇంట్లో చెప్పలేదు. తర్వాత ఇంటికి వెళ్లి జరిగిన విషయం వాళ్ల అమ్మకి చెప్పగా ఆమె పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఈక్రమంలోనే పోలీసులు గాలించగా మహేశ్వరం సమీపంలో ముగ్గురు నిందితులు పట్టుబడ్డారు. నిందితులనుంచి మూడు సెల్ ఫోన్లు మణిదీప్ నుండి కారుని స్వాధీనపర్చుకున్నామని ఇంతేజార్‌గంజ్ సీఐ మచ్చ శివకుమార్ తెలిపారు. నిందితులు ముగ్గురిని రిమాండ్‌కి పంపారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

## ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- పరకాలలో సర్వేను పరిశీలించిన కలెక్టర్

అక్షర దర్బార్, పరకాల : ప్రభుత్వ పథకాల వర్తింపునకు ఫ్యామిలీ డిజిటల్ కార్డులకు కోసం చేపట్టిన సర్వేను సమగ్ర వివరాలతో వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లా పరకాల మున్సిపల్ పరిధిలోని రెండో వార్డులో పైలట్ ప్రాజెక్టుగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే కొనసాగుతుండగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆ ప్రాంతంలో సాగుతున్న సర్వే వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఆధారంగానే ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. పైలట్ ప్రాజెక్టుగా గుర్తించిన ప్రాంతాల్లో సర్వే ను ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వేకు సంబంధించి అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. అదేవిధంగా యూపిహెచ్ సి నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని డిఎంహెచ్‌ఓ డాక్టర్ లలితాదేవి, అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. స్థలానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీవో డాక్టర్ కె. నారాయణ, మున్సిపల్ కమిషనర్ నరసింహ పాల్గొన్నారు.

## టమాట కిలో @ రూ.100

అక్షర దర్బార్, వరంగల్ : మార్కెట్లో కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. శుక్రవారం మార్కెటులో టమాట కిలో ధర రూ.100 పలకడంతో వినియోగదారులు కూరగాయల ధరలను చూసి బెంబేలెత్తుతున్నారు. టమాట ధర ఏకంగా రూ.100 పలకడంతో వినియోగదారులు కిలో కొనేవారు అరకిలలో, పావు కిలో మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. వీటితోపాటు మిగతా కూరగాయలు రేట్లు కూడా అధికంగా ఉండడంతో ఎలా కొనేది అంటూ సామాన్య ప్రజలు వాపోతున్నారు.




# ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్స్

అక్షర దర్బార్, మరిపెడ: సమగ్ర శిక్ష తెలంగాణ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లాలో వృత్తి విద్యా కోర్సులైన రిటైల్ మార్కెటింగ్ కంప్యూటర్ కోర్సుల్లో ఇంటర్నషిప్ ప్రోగ్రామ్స్ జరుగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దసరా సెలవుల దృష్ట్యా విద్యార్థులు ఈ ప్రోగ్రామ్స్ లో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నట్లు వెల్లడించారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఎండీ అక్తర్, ఒకేషనల్ ట్రైనర్స్ మిరియాల నాగేశ్వరరావు, అనుముల ప్రవీణ్ కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

